

న్యాయవాదులకు 'మధ్యవర్తిత్వం'పై శిక్షణ

ప్రజాశక్తి-కడప : కడపలోని బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులకు 'మధ్యవర్తిత్వం'పై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ బీనాదేవరాజ్ మాట్లాడుతూ కేసులు త్వరితగతిన పూర్తయ్యేందుకు మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు ఇస్తున్న శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ 40 గంటల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. న్యాయవాదులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు బొగ్గుల గురప్ప నాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీనా దేవరాజ్

జిజిహెచ్ అభివృద్ధి అందరి బాధ్యత

- వైద్య విభాగాధిపతుల సమావేశంలో కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న జిల్లా సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వైద్య విభాగాధిపతులకు సూచించారు. బుధవారం రిమ్స్ ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ సెమినార్ హాలులో వైద్య విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిజిహెచ్ జిల్లా ప్రజలకు మాత్రమే కాకుండా రాయలసీమ స్థాయిలో కూడా ప్రజలకు అత్యుత్తమ, మెరుగైన వైద్య సేవలు అందిస్తూ రాష్ట్రంలోనే అత్యుత్తమ టీచింగ్ హాస్పిటల్‌గా పేరు గడించిందన్నారు. మెరుగైన వైద్యసేవలతో వేలాది మంది ప్రజలు ప్రతి నిత్యం ప్రాణరక్షణ కల్పిస్తున్న జిజిహెచ్ ఆసుపత్రిని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. జిజిహెచ్ పరిధిలో ఇప్పటికే చాలా అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని, అధునాతన సదుపాయాలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, క్యాన్సర్ రీసెర్చ్ ఆసుపత్రి, నేత్ర వైద్యశాల, మానసిక వైద్యశాలలు ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. మరో ఐదారు నెలల్లో అత్యాధునిక వైద్య సేవలు అందించే మెడికల్ హబ్‌గా జిజిహెచ్‌ను తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యం దిశగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. వైద్య విభాగాధిపతులు కేవలం వైద్యం వరకే పరిమితం కాకుండా ఆయా విభాగాల్లో పరికరాల నిర్వహణ, యాజమాన్యాలపై కూడా దృష్టి సారించాలన్నారు. వైద్యం కోసం వచ్చే ప్రతి పేషంట్ 100 శాతం కంప్లీట్ సంతృప్తికరంగా తిరిగి ఇంటికి వెళ్లేలా వైద్యసేవలు అందించాలన్నారు. పేషంట్లు నుండి అందే ఫీడ్ బ్యాక్ ఆధారంగానే జిజిహెచ్ భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. పేషంట్‌కు వైద్యం అందించే విషయంలో ఎలాంటి కొరత రాకుండా ఆసుపత్రి యాజమాన్యం జాగ్రత్తలు వహించాలన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల్లో అవసరమైన మందులను ప్రణాళికాబద్ధంగా నిల్వ ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను కూడా పటిష్టం చేయాలన్నారు. రక్తనిధి కేంద్రంలో అన్ని రకాల పేషంట్లకు అత్యవసరమైన అన్ని గ్రూపుల రక్తాన్ని అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జిజిహెచ్‌లోని అన్ని విభాగాల్లో అవసరమైన వసతులు, సదుపాయాలు, వైద్య పరికరాలు, వైద్య సిబ్బంది తదితర అన్ని వివరాలను ఆయా వైద్య విభాగాధిపతులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఆయా విభాగాల్లో ఎలాంటి కొరత లేకుండా అవసరమైన వైద్య పరికరాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిజిహెచ్ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. అవసరమైతే సీఎస్ఆర్ నిధుల ద్వారా కూడా మౌలిక సదుపాయాలను సమకూర్చేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగరాజు, ఎవివిపి జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ హేమదేవి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, ఆర్ఎంఒ డాక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఆర్ఎంఒలు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ శ్రీధర్, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ శ్వేత అన్ని విభాగాల వైద్యాధిపతులు పాల్గొన్నారు.



రిమ్స్ ఒపి విభాగంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

ఒపి, ఐపి బ్లాకుల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

జిజిహెచ్‌లో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒపి, ఐపి బ్లాకుల్లోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్సు పరిశీలించారు. ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించి అక్కడి మౌలిక వసతులైన ఎక్విప్మెంట్స్, సదుపాయాల గురించి హెచ్‌ఒడి, సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవనం వద్దకు వెళ్లి అక్కడి విభాగాలను పరిశీలించి సదుపాయాలపై ఆరా తీశారు. ఎకో, టుడి స్కానింగ్ సెంటర్లతో పాటు కార్డియాలజీ, న్యూరాలజీ, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, పోస్ట్ ఒపి, రికవరీ వార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. సైకియాట్రిక్ హాస్పిటల్స్ బ్లాకులను తనిఖీ చేసి సంబంధిత ల్యాబులు, పరికరాలు, డీఆడిక్షన్ వార్డు, సదుపాయాలను, క్యాన్సర్ హాస్పిటల్ ఒపి, ఐపిలను పరిశీలించారు.

'ఉక్కు' ఏర్పాటుపై ప్రభుత్వాలు విఫలం

- జనవరి 4, 5వ తేదీల్లో సిపిఎం జిల్లా మహాసభలు
- జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని 20 సంవత్సరాలుగా జిల్లా ప్రజల ఆకాంక్ష అని, దాన్ని నిర్మించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం సిపిఎం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. గతంలో అనేక సాకులు చెప్పిన పాలకులు ప్రస్తుతం అధికారంలో ఉన్నారన్నారు. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ బిజెపి కూటమి పార్టీలు అధికారంలో ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి జిల్లాలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేలా అవకాశమున్న కృషి చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా అభివృద్ధి మీద నిర్లక్ష్యంగా ఉన్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరిశ్రమలు ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నప్పటికీ పాలకవర్గాలకు చిత్తశుద్ధి లేదన్నారు. రాయలసీమ ప్రాంతంలో కడప నడిబొడ్డున ఉందని ఈ ప్రాంతంలో అపారమైన అవకాశాలు మెండుగా అనేక అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. సిపిఎం రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తుందని, ఆ పోరాటాల విజయవంతానికి జిల్లా ప్రజానీకం సహకరించాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

జనవరి 4, 5వ తేదీల్లో సిపిఎం జిల్లా మహాసభలు :సిపిఎం కడప జిల్లా 12వ మహాసభలు 2025 జనవరి 4, 5వ తేదీల్లో కడప నగరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు జియాన్ కాలేజీ వద్ద నుంచి ఐటిఐ సర్కిల్ వరకు ర్యాలీ, ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఐటిఐ సర్కిల్ వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, అన్వేష్ పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాల్లో వైవీయూ మెరుగైన పనితీరు

- ◆ ఐఎస్ఒ ప్రతినిధుల బృందం సంతృప్తి
- ◆ అభివృద్ధికి వైవీయూకు పలు సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న సిఇఒ శివయ్య

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం నాణ్యత ప్రమాణాలతో ఉన్నత పనితీరును కనపర్చినప్పటికీ మరింత ప్రగతి దిశగా వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్(ఐఎస్ఒ) ప్రతినిధి హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సిఇఒ ఆలపాటి శివయ్య స్పష్టం చేశారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో ఐఎస్ఒ ప్రతినిధుల బృందం సందర్శన పూర్తయింది. అనంతరం ఐక్యూఎసి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కుల సచివులు ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, అన్ని శాఖల అధిపతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఇఒ శివయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయ సమగ్ర పరిశీలనలో బృందం దృష్టికి వచ్చిన పలు అంశాలను ప్రస్తావించారు. బోధన, పరిశోధనలు, పరిసరాలు నాణ్యమైనవిగా ఉన్నాయని తెలిపారు. శాఖల వారీగా ఐదు వరకు గ్రేడులు ఇచ్చారని, అక్కడక్కడ రికార్డుల నిర్వహణ మెరుగు కావలసి ఉందన్నారు. ప్రతి డాక్యుమెంట్‌కు సంబంధించిన ఆధారం ఫైలింగ్ చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ పొదుపు పాటించాలన్నారు. అన్ని శాఖలు బాగా పనిచేస్తున్నాయని ప్రశంసిస్తూనే మరింతగా పనిచేస్తే ఉన్నతమైన న్యాక్ గ్రేడును వైవీయూ సొంతం చేసుకుంటుందన్నారు. హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ ఆడిటర్ టి.సుమాదేవి మాట్లాడుతూ వైవీయూ అభివృద్ధికి మెరుగైన సూచనలు చేశారు. విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐఎస్ఒ ప్రతినిధుల బృందం విశ్వవిద్యాలయానికి సంబంధించి వాస్తవ నివేదికను ఇచ్చిందని, వారి సూచనలు పాటించి అభివృద్ధి దిశగా ముందుకు వెళతామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ ఫైల్ మేనేజ్మెంట్‌పై బోధనేతర సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి డాక్యుమెంటేషన్‌కు ఇకపై ఆధారాలు ఉండేలా చూస్తామన్నారు. రెండు రోజుల బృందం పరిశీలనలో సమన్వయం చేసిన ఐక్యూఎసి సంచాలకులు డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యం శర్మ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఐఎస్ఒ ప్రతినిధులకు, వైవీయూ అధ్యాపకులకు సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఐక్యూఎసి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుభాష్ చంద్ర, సభ్యులు ఆచార్య రియాజున్నిసా, డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ టి.శ్యామ్ స్వరూప్, డాక్టర్ దాక్షాయని, అన్ని శాఖల అధిపతులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలివ్వకపోతే కార్పొరేషన్ ముట్టడి



ధర్నాలో మాట్లాడుతున్న సుంకర రవి

ప్రజాశక్తి-కడప అర్బన్

కోవిడ్-19, అడిషనల్ పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించకపోతే కార్పొరేషన్ ముట్టడిస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు సుంకర రవి హెచ్చరించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట 24 గంటల ధర్నా చేపట్టారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ వేతనాలు రాక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనలు చేస్తున్న పాలకవర్గం, అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే ఈ నెల 23న కార్పొరేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఇత్తడి ప్రకాష్, కంచుపాటి తిరుపాల్, సుంకర కిరణ్, కార్మికులు పాల్గొన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి ఈ నెల 23న నిర్వహించే సర్వసభ్య సమావేశంలో బిల్లు పెట్టి వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా ధర్నా వాయిదా వేశారు.



అన్నదానం చేస్తున్న కరుణాకర్ సతీమణి రత్నకుమారి

వివేకానంద వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రమైన నరసాపురంలోని వివేకానంద వృద్ధాశ్రమంలో కలసపాడు మండలం శంకరం గ్రామానికి చెందిన పచ్చినీళ్ల దేవరాజు జ్ఞాపకార్థం 36వ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు పచ్చినీళ్ళ ఆనందరావు కరుణాకరు సతీమణి రత్నకుమారి కలిసి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ మా తండ్రికి పేదలంటే ఎంతో ఇష్టమని తెలిపారు. అనాథాశ్రమంలో అన్నదానం చేయడంతో సంతోషంగా ఉందన్నారు. అనాథాశ్రమాన్ని నడుపుతున్న వారి సేవలు చాలా అభినందియమని కొనియాడారు. వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి సతీమణి తులసమ్మకు ఈ యొక్క అవకాశం ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

- డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత

ప్రజాశక్తి - కడప

మైనార్టీలు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శాంత అన్నారు. బుధవారం మైనార్టీల హక్కుల దినోత్సవం సందర్భంగా నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయ వాదులచే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదశంలోని మైనారిటీ వర్గాల హక్కులను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం డిసెంబర్ 18న మైనారిటీ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటారు అని తెలిపారు. ప్రస్తుత మైనారిటీల శాతం దేశంలోని మొత్తం జనాభాలో 19.3 శాతం ఉందన్నారు. భారతదేశంలో మైనారిటీల హక్కుల దినోత్సవం 2024 థీమ్ "వైవిధ్యాన్ని ప్రోత్సహించడం మరియు హక్కులను రక్షించడం" అని తెలిపారు. మైనారిటీల హక్కుల దినోత్సవం స్వేచ్ఛ, సమాన అవకాశాలను మైనారిటీలకు అలాగే ఆ హక్కులపై అవగాహన పెంచుకోవడం అని అన్నారు. ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, జొరాస్ట్రియన్‌లు (పార్సీలు) నేషనల్ కమిషన్ ఫర్ మైనారిటీస్ చట్టం, 1992లోని సెక్షన్ 2 (సి) ప్రకారం మైనారిటీ కమ్యూనిటీలుగా ప్రకటించబడ్డారు అని అన్నారు. రాజ్యాంగ హక్కులను గురించి వివరిస్తూ ఆర్టికల్ 14, 15, 16, 25, 26, 27, 28, 39, 30, ఆర్టికల్ ఆర్టికల్ 350 బి ల గురించి వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 151000 మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత



అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

అభివృద్ధి పనులు పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డి మార్నింగ్ విజిట్‌లో భాగంగా బుధవారం రెడ్డికాలనీ, ఓల్డ్ మున్సిపల్ ఆఫీస్, బుగ్గకాలని ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగా అధికారులతో కలిసి పరిశీలించారు. రెడ్డి కాలనీ, శ్రీనిలయం అపార్ట్మెంట్, సిఆర్ఎస్ రెసిడెన్సి మోటిగేజ్ కోసం అప్లై చేయడంతో, ఆ ప్రాంతపు టిపిబిఒ, డబ్ల్యూపిఆర్ఎస్ పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న పార్ట్ హోల్స్‌ను వెంటనే క్లియర్ చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశాలు ఇచ్చారు. సి, డి వేస్ట్ వేసిన వారిపై జరిమానా విధించేందుకు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓల్డ్ మున్సిపల్ ఆఫీస్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో పరిశీలన చేస్తూ అక్కడ నీటి ట్యాంక్ పాడవుతుండటం వల్ల, కొత్తగా నిర్మించిన ట్యాంక్ నుంచి కడప నగర ప్రజలకు నీటి సరఫరా సజావుగా కొనసాగించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు నీటి సరఫరాను నిరోధించకుండా కొనసాగించేందుకు, ఇంజినీరింగ్ విభాగం ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఎస్ఇ చెన్నకేశవరెడ్డికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బుగ్గ కాలని కొత్తగా ఏర్పాటు చేసిన గిఫ్ట్ డిడి నిర్మాణ పనులు, అనుమతులు లేకుండా చేపట్టిన గృహాన్ని తక్షణమే తొలగించడానికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిటీ ప్లానర్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన అప్రూవల్స్‌ను ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధనలక్ష్మికి సమర్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్లాన్ అప్రూవల్స్ అన్ని నామ్స్ సరైన రీతిలో ఉండేలా అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ రమణ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ ఆర్‌టిసి ఆర్‌ఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో ఆర్‌టిసి సమస్యలపై ఈ నెల 20న డయల్ యువర్ ఆర్‌టిసి ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణ అధికారి గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రజలు 9959225848 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. వాట్సాప్ చేయవచ్చని పేర్కొన్నారు.

ఎంబిఎ విద్యార్థులకు సెమినార్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని కందుల స్కూల్ ఆఫ్ మేనేజిమెంట్ అండ్ ప్లేస్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో బుధవారం ఎంబిఎ విద్యార్థులకు కార్పొరేట్ క్యాంయిన్ కెరియర్ గ్రోత్ ఇంటర్నషిప్, లీడర్‌షిప్ క్వాలిటిస్ అనే పాపిక్ మీద స్పీకర్ ఎం.దిలీప్ సెమినార్ నిర్వహించారు. మెళకువలగురించి వివరించారు. సీనియర్ శిక్షకులు రాయపాటి నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్‌కు కావాల్సిన మేనేజింగ్ స్కిల్స్ తెలిపారు. కాలేజీ నుంచి కార్పొరేట్ సమాజంలోకి మారడం ఒక సవాల్ అని చెప్పారు. సరైన మార్గదర్శకత్వం ఉంటే సులభమన్నారు. కార్యక్రమంలో కెఎస్ఆర్ఎం మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగమణి, డాక్టర్ రత్నమ్మ, రమణ, సిద్ధిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 36 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు : డిఆర్ఒ

ప్రజాశక్తి - కడప: భూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 19వ తేదీన జిల్లాలోని 36 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు డిఆర్ఒ విశ్వేశ్వరనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్‌లోని అట్లూరు మండలం మాదాపూర్, బి.కోడూరు మండలం మరతిపల్లి, బి.మఠం మండలం డి.అగ్రహారం, బద్వేల్ మండలం చింతలచెరువు, కలసపాడు మండలం పుల్లారెడ్డిపల్లి, మైదు కూరు మండలం మిట్టమానిపల్లి, పోరుమామిల్ల మండలం అక్కల రెడ్డిపల్లె, కాశినాయన మండలం కథెరగండ్ల (కొడిగుడ్లపాడు), పులివెం దుల రెవెన్యూ డివిజన్‌లోని చక్రాయపేట మండలం చిలెకంపల్లి, లింగాల మండలం మురారిచింతల, పులివెందుల మండలం బ్రాహ్మ ణపల్లె, సింహాద్రిపురం మండలం నంద్యాలంపల్లి, తొండూరు మండలం గోటూరు, వేంపల్లె మండలం వేంపల్లె-1, వేముల మండలం వి.కొత్తపల్లి, విఎన్.పల్లి మండలం పిల్లివారిపల్లి, జమ్మల మడుగు రెవెన్యూ డివిజన్‌లోని చాపాడు మండలం పిచపాడు, దువ్వూరు మండలం దువ్వూరు, జమ్మలమడుగు మండలం పి.బొమ్మేపల్లి, కొండాపురం మండలం ఓబన్నపేట, కొండాపురం మండలం గండ్లూరు, ముద్దనూరు మండలం నల్లబల్లి, మైలవరం మండలం రామచంద్రయపల్లి, పెద్దముడియం మండలం పెద్దపసుపుల, ప్రొద్దుటూరు మండలం సర్వారెడ్డిపల్లె, రాజుపాలెం మండలం అయ్యవారిపల్లె (హాబిటేషన్), ఎర్రగుంట్ల మండలం కలమల్ల, కడప రెవెన్యూ డివిజన్‌లోని చెన్నూరు మండలం చిన్నామచుపల్లి, సికె దిన్నె మండలం ఇప్పపెంట, కమలాపురం మండలం గొల్లపల్లి, ఖాజీపేట మండలం నాగసానిపల్లి, పెండ్లిమర్రి మండలం నందిమండలం, పెండ్లి మర్రి మండలం ఎ.వి.కాలువ, సిద్దవటం మండలం పెద్దపల్లి, వల్లూరు మండలం జంగమపల్లి, ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగనున్నాయని తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలవండి

ప్రజాశక్తి-కడప అర్బన్: ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు ఎన్నో సౌకర్యాలను అందిస్తుందని వాటన్నిటిని వారికి అందేలా చూడాలని ఎంఇఒలకు కోఆర్డినేటర్ కల్పనా శైలారి దిశా నిర్దేశం చేశారు. బుధవారం నగర శివారులలోని గీతం కళాశాలలో ప్రత్యేక అవసరాల పిల్లలకు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు విచ్చేసి వివిధ అంశాల పైన అవగాహన కల్పించారు. బడిబయట ఉండే విద్యార్థులందరినీ బడిలో చేర్పించాలని, ప్రతి విభిన్న ప్రతిభావంతుడికి ప్రభుత్వం కల్పించే ప్రతి సౌకర్యం అందేలా చూడాలని పేర్కొన్నారు. భవిత విద్యార్థులకి ట్రాన్స్‌ఫోర్ట్, ఎస్కార్ట్, గర్ల్స్ స్టయిఫండ్ అలవెన్స్‌లు ఇచ్చినట్లు తెలిపారు. ఒక్క విభిన్న ప్రతిభావంతుడిని గుర్తించి వారికి సదరం సర్టిఫికెట్ ఇప్పించడంతోపాటు, వారి ప్రగతికి అవసరమైన విద్యా బోధన, ఉపకరణాలు, ఆరోగ్య సౌకర్యాలు అందేలా చూడాలన్నారు. బడిబయట పిల్లలు అందరూ బడిలో ఉండేటట్లు చూడాలని, అందరికీ విద్య అందాలని చెప్పారు. రిమ్స్ సూపరింటెండెంట్ సైక్రియస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వెంకటరాముడు, క్లినికల్ సైకాలజిస్ట్ లక్ష్మీనారాయణ, అర్లీ చైల్డ్ ఇంటర్వెన్షన్ సెంటర్ డాక్టర్ ఫక్రుద్దీన్, సదరం సర్టిఫికెట్ విభాగాధిపతి నాగయ్యతో పాటు ఎస్సీ కార్పొరేషన్ ఇడి డాక్టర్ బ్రహ్మయ్య హాజరై వివిధ విభాగాలకు సంబంధించిన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి, ఎడి కృష్ణకిషోర్, సహిత విద్యా సమన్వయకర్తలు కేశవరెడ్డి, రమణమూర్తి, వివిధ మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ కల్పన



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి

పింఛన్లు తొలగించేందుకు ప్రభుత్వం కుట్ర : వైసిపి

ప్రజాశక్తి-కమలాపురం టౌన్

పింఛన్లు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున కుట్ర పన్నుతోందని వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు లక్షల పింఛన్లు తొలగించిందన్నారు. మరో 5 లక్షల పింఛన్లు తొలగించాలని టార్గెట్‌గా పెట్టుకుందన్నారు. వైసిపి ప్రభుత్వం 66 లక్షలకుపైగా పింఛన్లు ఇచ్చేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు లక్షలు పెన్షన్లు కోత పెట్టిందని తెలిపారు. వైసిపి మద్దతుదారులకు పింఛన్లు తొలగించేందుకే ఈ కార్యక్రమం చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచమని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.9 వేల కోట్లకుపైగా భారం మోపారని విమర్శించారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ఈ నెల 27న కడప విద్యుత్ ఎస్ఇ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, కమలాపురం టౌన్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మారుజోళ్ళ శ్రీనివాసులరెడ్డి, సాదిక్ భాష, కొండారెడ్డి, సుబ్బారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు

నిరుద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-బద్వేలు

సోమశిల ముంపు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని వారి వద్ద నుండి రూ.లక్షలు వసూలు చేసిన రామస్వామిని తక్షణమే అరెస్టు చేసి ముంపు నిరుద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య కాలనీలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమశిల ముంపు ప్రాజెక్టు కింద నష్టపోయిన నిరుద్యోగులకు ప్రభుత్వం ఖాళీగా ఉన్న వివిధ శాఖలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలిపారు. గతంలో ప్రభుత్వం చెప్పిన ప్రకారం ఉద్యోగాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలుగా ఉన్న పోస్టులలో ముంపు వాసులకు న్యాయం చేయాలని కోరారు. రామస్వామి నుంచి డబ్బును రికవరీ చేసి నిరుద్యోగులకు తిరిగి ఇప్పించాలని, లేనిపక్షంలో నిరుద్యోగులను కలుపుకొని జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలోపట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్ షరీఫ్, ఎస్.కె.ఆదిల్ బద్వేల్ రూరల్ కార్యదర్శి యు.బాల గురవయ్య, మహిళా కో-కన్వీనర్ ఫాతిమా, సాయి లక్ష్మి, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

రోడ్ల విస్తరణ చేపట్టాలని ఎంపీ వినతి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ట్రాఫిక్‌తో రోడ్లు రద్దీగా ఉన్నాయని, వాటిని విస్తరింపజేయాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, హైవే మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఆ మేరకు ఆయన బుధవారం ఢిల్లీలో మంత్రిని కలిసి కడప జిల్లా రోడ్ల పరిస్థితిని వివరించారు. కడప జిల్లా నుంచి ప్రకాశం జిల్లాకు వెళ్లే ముఖ్యమైన మార్గం, ఏదారి పొడవునా భారీ ట్రాఫిక్ రద్దీగా ఉండే రహదారి అన్నారు. కడప జిల్లాలోని ఎన్‌హెచ్-716లో భాకరాపేట నుంచి ప్రకాశం జిల్లాలోని ఎన్‌హెచ్-544డిలో బద్వేల్ ఎన్‌హెచ్-67, పోరుమామిళ్ల ఎన్‌హెచ్-167బి మీదుగా బెస్తవారిపేట వరకు కి.మీ.0/0 నుంచి 140/00 వరకు గల రహదారిని జాతీయ రహదారిగా అప్‌గ్రేడేషన్ చేయాలని కోరారు. ఇదివరకే వినతిపత్రాలు సమర్పించానని గుర్తు చేశారు. రేణిగుంట-ముద్దనూరు రోడ్డు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అత్యంత ముఖ్యమైన జాతీయ రహదారులలో ఒకటని తెలిపారు. వార్షిక ప్రణాళిక 2024-25 ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్‌హెచ్-716 కడప, ముద్దనూరు రోడ్డు విస్తరణ కోసం వనిపెంట గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా సరిపడా భూమి ఉందన్నారు. చాలా మంది గ్రామస్తులు హైవే ప్రయోజనం కోసం తమ భూమిని విడిచిపెట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఎంపీ వివరించారు.

జమిలి ఎన్నికలు సమాఖ్య వ్యవస్థకు గొడ్డలి పెట్టు

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న జమిలి ఎన్నికల ప్రస్తావన పిచ్చి తుగ్లక్ నిర్ణయమని, సమాఖ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టు అని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జమిలి ఎన్నికలు అనవసరమని, అవసరం కూడా సాధ్యం కాదన్నారు. ఎన్నికల ఖర్చు మొత్తం బడ్జెట్‌లో 0.01 శాతం మాత్రమేనని తెలిపారు. ఎన్నికల ఖర్చు తగ్గించడం కోసమే జమిలి ఎన్నికలని చెప్పడంలో వాస్తవం లేదన్నారు. తరచుగా ఎన్నికలు వస్తున్నందున ఎన్నికల కోడ్ వల్ల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని చెప్పడం కూడా సాకు మాత్రమే అన్నారు. జమిలి ఎన్నికలు జరగాలంటే రాజ్యాంగ సవరణలు అవసరమన్నారు. రాజ్యాంగ సవరణలు చేయాలంటే పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీ ఉండాలని, కాని మోడీ ప్రభుత్వానికి అంత మెజారిటీ లేదన్నారు. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికలు జరపడం అసాధ్యమని తులసిరెడ్డి వివరించారు.

కడప: జమిలి ఎన్నికల బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకమని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు ఎస్.కె.విజయజ్యోతి తెలిపారు. జమిలి ఎన్నికల బిల్లును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ జమిలి ఎన్నికలను అమలు చేయడానికి లోక్‌సభలో రెండు బిల్లులు ప్రవేశపెట్టడం, వాటిని సంయుక్త పార్లమెంట్ కమిటీకి పంపించడం చట్ట వ్యతిరేకమని పేర్కొన్నారు.

పలుచోట్ల అన్నదానాలు

ప్రజాశక్తి - లింగాల



మారారిచింతల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పైడిపల్లె పక్కీరయ్య 5వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు దేవరపు ప్రాంతాల్లో బుధవారం అన్నదానం చేశారు. పక్కీరయ్య కుమారుడు బాబా హుస్సేన్, కోడలు షహీరా, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మండలంలోని ఇప్పట్ల లింగాలకు పుణ్యక్షేత్రం, పులివెందుల జయమ్మ కాలనీ ముస్లిం మదరసాలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షులు రసూల్, ఎంపిటిసి లోమడ రాజాబాబు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు మైదుకూరు తహశీల్దార్ రాజసింహ నరేంద్ర తెలిపారు. మండల పరిధిలోని మిట్టమానుపల్లె గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి రెవెన్యూ సదస్సుల ప్రాముఖ్యతను వివరించారు. భూ సమస్యలను సభ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్‌నాయుడు, డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్, విఆర్‌ఒ ఓబులరెడ్డి, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చాపాడు: రైతుల నుంచి రెవెన్యూ సదస్సులకు వచ్చే ప్రతి సమస్యకు తప్పకుండా పరిష్కారం చెబుతామని తహశీల్దార్ రమాకుమారి తెలిపారు. మిడ్డ్రాయపల్లె ప్రాథమిక పాఠశాలలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఎస్సీ కాలనీలో పర్యటించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కృష్ణారెడ్డి, రీసర్వే డిటి నారాయణస్వామి, ఆర్‌ఐ శివశంకర్‌రెడ్డి, విఆర్‌ఒ సుబ్బన్న, సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, సర్వేయర్ సౌందర్య, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.



పత్తూరు-ఫయాంఖాన్‌పల్లె దారిలో నెలకొన్న అపరిశుభ్రత

పరిసరాలు ఇలా.. పట్టించుకోకపోతే ఎలా..?

ప్రజాశక్తి - ఖాజీపేట

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత, ప్రతి ఒక్కరూ శుభ్రతకు పాటు పడాలని ప్రజలకు అధికారులు సూచిస్తున్నారు. వారికి మాత్రం పారిశుధ్య సమస్య కనిపించడం లేదు. పత్తూరు పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫయాంఖాన్ పల్లె నుంచి పత్తూరుకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా వ్యర్థ పదార్థాలు పెద్ద ఎత్తున పేరుకుని ఉన్నాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సమీప నివాసాల్లోని ప్రజలందరూ వ్యర్థాలను రోడ్లపై వేస్తున్నారు. దుర్వాసన పెద్ద ఎత్తున వెదజల్లుతోందని, అంటు వ్యాధులు ప్రబలుతాయేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు విజృంభిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెత్తాచెదారాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికులకు వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మున్సిపల్ రెగ్యులర్, ఆప్కాస్ కార్మికులకు 2023-24 సంవత్సరానికి సంబంధించి వస్తువులు బుధవారం పంపిణీ చేశారు. కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘం(సిఐటియు అనుబంధం) ప్రధాన కార్యదర్శి సాల్మన్ మాట్లాడుతూ త్వరలో యూనిఫామ్ చీరలు, టవళ్లు కూడా పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారని పేర్కొన్నారు. జీతాలకు సంబంధించిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. కరోనా కార్మికులకు, నగర దీపికలు పెండింగ్ జీతాలు త్వరలో మంజూరు చేస్తామన్నారు. వారంలోపు వచ్చే అవకాశం ఉందన్నారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అడిగామన్నారు. అధికారులు సానుకూలంగా స్పందించినట్లు సల్మాన్ తెలిపారు.

అకాల వర్షం.. ఇబ్బందుల్లో రైతులు

కొనుగోలు కేంద్రాలు తెరవని ప్రభుత్వం - ప్రయివేట్ దళారులే దిక్కు



వడియరాజుపేట వద్ద వరి ధాన్యాన్ని టార్పలిన్ పట్టలతో కప్పి ఉంచిన రైతులు

ప్రజాశక్తి - చాపాడు

వరి పంట నూర్పిడి చేస్తున్న రైతులను మంగళవారం అర్ధరాత్రి వర్షం పడి, వారిని ఇబ్బందులకు గురి చేసింది. గత వారంలో తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు మళ్లీ అకాల వర్షంతో నానా అవస్థలు పడుతున్నారు. ఆది, సోమవారాలు వర్షం పడకపోవడంతో నూర్పిడి పనులపై రైతులు దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా వర్షం పడింది. పంట పొలాల్లో ఉన్న వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర అగచాట్లు పడ్డారు. నూర్పిడి చేసిన వరి ధాన్యాన్ని కుప్పలుగా పోసుకొని టార్పలిన్ పట్టలు కప్పుకున్నారు. పంట పొలాలకు సమీపంలో ఉన్న రోడ్లపైకి ధాన్యాన్ని చేర్చుకొని టార్పలిన్ పట్టలు కప్పి ఉంచారు. ఈ ఏడాది వరి పంట రైతులను తుఫాను వెంటాడుతూనే ఉంది. పంట సాగు చేసినప్పటి నుండి ఆశాజనకంగా ఉన్నప్పటికీ నూర్పిడి సమయంలో వరుస తుఫానులతో రైతులు కుదేలవుతున్నారు. పంట నేలకొరగడం, ధాన్యం తడవడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరి ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వేల ఎకరాలలో వరి పంట నూర్పిడి జరుగుతున్నా కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ఈ పరిస్థితుల్లో ప్రయివేట్ దళారులు సూచించిన ధరలకు రైతులు ధాన్యాన్ని అమ్మాల్సి వస్తోంది. చాపాడు మండల పరిధిలో 12వేల ఎకరాలలో వరి పంట నూర్పిడి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 8 బస్తాల ధర రూ.11,500 నుంచి రూ.12 వేల వరకు పలుకుతోంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్న రైతులు పంట పొలాల్లోనే అమ్మకాలు చేపడుతున్నారు. మిగిలిన రైతులు ధాన్యాన్ని నిల్వ చేస్తున్నారు.

పరిహారంలో న్యాయం చేస్తాం : జెసి

ప్రజాశక్తి - వేంపల్లె

జాతీయ రహదారికి సంబంధించి చాగలమర్రి-రాయచోటి రోడ్డు నిర్మాణంలో భూములు, స్థలాలు కోల్పోయే వారికి పరిహారం పంపిణీలో న్యాయం చేస్తామని జెసి అతిథిసింగ్ పేర్కొన్నారు. స్థానిక వైఎస్ఆర్ సభాభవనంలో బుధవారం రోడ్డు నిర్మాణంలో భూములు, స్థలాలు కోల్పోయే రైతులు, లబ్ధిదారులతో నష్టపరిహారంపై రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి లబ్ధిదారులతో నష్టపరిహారంపై చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో ఎకరా రూ.2కోట్లు వరకు ధర పలుకుతోందని, దానికి అనుగుణంగా లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇచ్చేలా చూడాలని టిడిపి మండల కన్వీనర్ ఎస్.రామమునిరెడ్డి కోరారు. ఇందుకు జెసి స్పందిస్తూ జాతీయ రహదారి నిర్మాణానికి భూములు, ఇంటి స్థలాలు కోల్పోయే వారు సహకరించాలని కోరారు. రైతులకు, లబ్ధిదారులకు నష్టం జరగకుండా పరిహారం అందిస్తామన్నారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం వేంపల్లె మండలంలోని ఆయా ప్రాంతాల్లో 46.69 ఎకరాల భూమిని దాదాపు 200 మంది లబ్ధిదారులతో సేకరించినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎకరాకు రూ.15 లక్షలు నష్టపరిహారం కేటాయించినట్లు చెప్పారు. వ్యవసాయ భూమి అయితే ఎంత విలువ ఉంటుంది.. పక్కా భవనాలు ఉంటే ఎంత విలువ ఉంటుందనే దానిపై లబ్ధిదారులకు తెలియజేయడానికి సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం కూడా లబ్ధిదారులకు తెలిపామన్నారు. రైతులు, లబ్ధిదారులు అడిగిన పరిహారంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా న్యాయం చేస్తామని జెసి వివరించారు. ఎన్‌హెచ్ యాక్ట్ ప్రకారం నష్ట పరిహారం ఫైనల్ చేసి లబ్ధిదారులకు అవార్డు ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఆర్‌డిఒ చిన్నయ్య, తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి, జాతీయ రహదారి అధికారులు, విఆర్‌ఒలు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో చర్చిస్తున్న జెసి అతిథిసింగ్

ఎర్రగుంట్ల : చాగలమర్రి నుంచి వేంపల్లెకు వెళుతున్న నేషనల్ హైవే 440నిమిత్తం ప్రభుత్వం తీసుకోనున్న భూములకు మార్కెట్లోనున్న ధర ప్రకారం చెల్లించాలని భూములు కోల్పోతున్న వారు జెసి అదిథిసింగ్‌ను కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆమె భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చెప్పే లెక్కలు చాలా తక్కువ ఉన్నాయని, మార్కెట్ విలువ చాలా ఎక్కువగా ఉందని జెసితో రైతులు మొరపెట్టుకున్నారు. స్థానికంగా పెదనపాడు, కోడూరు, ఎర్రగుంట్ల, తిప్పలూరు, పోట్లదుర్తి ఐదు గ్రామాలకు సంబంధించి 101 ఎకరాల 65 సెంట్ల భూమిని రోడ్డు నిమిత్తం తీసుకోనున్నారు. ఎర్రగుంట్లలో బైపాస్ కోసం భూమిని తక్కువ ధరకు కోల్పోయామని, ఇప్పుడు మళ్లీ హైవేకు భూమిని కోల్పోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శోభన్‌బాబు, రెవెన్యూ సిబ్బంది, భూముల కోల్పోతున్న రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు(ఎల్ఎస్‌డిజి) ద్వారా గ్రామాల పురోగతిపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టిందని ఎంపిడిఒ వెంకటరమణయ్య అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం రెండవ రోజు గ్రామ సర్పంచులకు, పంచాయతీ సెక్రటరీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పాటుపడాలన్నారు. కనీస వసతుల కల్పనలో ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. పరిసరాల శుభ్రతతోపాటు తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దేవేంద్రరెడ్డి, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

చాపాడు : స్థానికరణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విఆర్‌ఒలు, సర్వేయర్‌లు, ఎఎన్ఎంలు, విఎఎలు, ఎనర్జీ అసిస్టెంట్‌లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ వీరకిషోర్ మాట్లాడుతూ గ్రామాల్లో స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి, వాటి ద్వారా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో సర్పంచుల సహకారంతో అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. 2030, 2047 నాటికి సాధించాల్సిన లక్ష్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం ట్రైనర్లు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం : ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపిడిఒ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయ సభవనంలో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై సర్పంచులు, సచివాలయ సిబ్బందికి రెండో విడత శిక్షణ నిర్వహించారు. వెలుగు ఎపిఎం మంజునాథ్, బిదనంచర్ల ప్రభుత్వ ఆస్పత్రి ఎంపిహెచ్ఒ సుకుమార్ పాల్గొన్నారు.

ఎస్‌విడిసికి న్యాక్ బి డబల్ ప్లస్ గుర్తింపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



సర్టిఫికెట్ చూపుతున్న ఒంటేరు, కరస్పాండెంట్

స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు న్యాక్ బి డబల్ ప్లస్ గుర్తింపు వచ్చిందని కళాశాల కరస్పాండెంట్ అర్కాట వేముల హరి నారాయణ పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో బి డబల్ ప్లస్ సాధించిన మొదటి కాలేజీగా ఎస్‌విడిసి ఉండడం చాలా సంతోషకరమన్నారు. 20ఏళ్ల నుంచి విద్యార్థులకు మంచి సౌకర్యాలతో కూడిన ఉన్నతమైన విద్యను ఇస్తున్న ఈ కళాశాల ఇంకా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కళాశాల కరస్పాండెంట్ అర్కాటవేముల హరి నారాయణ మాట్లాడుతూ ఇందుకు సహకరించిన కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, శ్రేయోభిలాషులు, మిత్రులు, అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో మద్యం బారు నిర్వహించుకునేందుకు దరఖాస్తులకు ఆహ్వానించినట్లు ఎక్సైజ్ సిఐ గోఎకృష్ణ తెలిపారు. ఈనెల 23 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సిఐ తెలిపారు. ఆసక్తిగలవారు రూ.5లక్షలు దరఖాస్తు నిమిత్తం చెల్లించాల్సి ఉందన్నారు. ఎర్రగుంట్ల ఎక్సైజ్ కార్యాలయంలో, కడపలో డిస్టిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలోగాని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గుడి, బడి, ఆస్పత్రులు బార్ వంద మీటర్ల దూరంలో ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. బార్‌కు కాలపరిమితి 2025 ఆగస్టు నెల 31వరకు ఉంటుందని సిఐ వివరించారు.

సిమెంట్ రోడ్లను సకాలంలో పూర్తి చేయాలి

- పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాసులరెడ్డి ఆదేశించారు. కేంద్రమైన చాపాడులో ఉపాధి హామీ చట్టం ద్వారా నిర్మించిన సిమెంట్ రోడ్లను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం సచివాలయంలో పంచాయతీరాజ్ అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ సంక్రాంతి పండుగలోపు పనులను పూర్తి చేయాలన్నారు. చాపాడు మండల పరిధిలో రూ.2 కోట్లు సిమెంట్ రోడ్లను మంజూరు చేశామన్నారు. రోడ్ల పనులు ప్రారంభించని వారు వెంటనే మొదలు పెట్టాలన్నారు. సిమెంట్ రోడ్లను నాణ్యతతో నిర్మించాలన్నారు. ఇప్పటికే సిమెంట్ రోడ్లు పూర్తయిన గ్రామాల్లో వెంటనే బిల్లులు మంజూరు చేసేందుకు అధికారులు రికార్డులు పంపాలని తెలిపారు. డిఇ మధుసూదన్ రావు, ఎంపిడిఒ వీరకిషోర్, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఎఇ కేశవ సాయివర్మ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, టిడిపి నాయకులు వైవి సుబ్బారెడ్డి, శివరామకృష్ణారెడ్డి, ఈశ్వరయ్య,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

విద్యుత్ అవసరం మేరకు ఉపయోగించి, పొదుపు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ట్రాన్స్ కో ఎడి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. బుధవారం మైదుకూరు పట్టణంలో బుధవారం ఆయన విద్యుత్ సిబ్బందితో కలిసి విద్యుత్ పొదుపు చేపట్టాలని నాలుగు రోడ్ల వెంట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక యూనిట్ పొదుపు.. తయారీ కన్నా గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ మీటర్లను ఉపయోగించాలన్నారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎఇ రామ భద్రయ్య, సబ్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులకు లైసెన్సులు

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని దత్తాపురం గ్రామానికి చెందిన మత్స్యకారులకు బుధవారం లైసెన్స్‌లను కొండాపురం మండల ఇన్‌ఛార్జి శివనారాయణరెడ్డి, ఎంపిడిఇ నాగప్రసాద్ , ఫిషరీష్ అసిస్టెంట్ మల్లీశ్వరి అందజేశారు. ఈ సందర్భంగా శివనారాయణరెడ్డి మాట్లాడుతూ చేపలు పట్టుటకు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. లైసెన్సు లేకుండా ఎవరైనా చేపలు పడితే చట్టరీత్యా నేరమన్నారు. లైసెన్సు ఉన్నవారు గడువులోపు రెన్యువల్ చేసుకుని ప్రభుత్వం నుంచి వచ్చే అన్నిరకాల మత్స్యకార పథకాలకు అర్హత సాధించాలన్నారు. ప్రమాదవశాత్తు లైసెన్సుదారుడు మరణిస్తే వారి కుటుంబానికి ప్రమాద బీమా ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. మండలంలో ఇప్పటి వరకు దాదాపు 200 మందికి మత్స్యకారులు లైసెన్స్ రెన్యువల్ చేసుకున్నారని ఆయన తెలిపారు. మండల టిడిపి అధ్యక్షులు నాగేశ్వరరెడ్డి, రామాంజులరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణ, రామసుబ్బారెడ్డి, గ్రామ నాయకులు, మత్స్యకారులు, పాల్గొన్నారు. అనంతరం శివ నారాయణరెడ్డి గురుకుల పాఠశాల విద్యార్థులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. మాజీ సర్పంచ్ వెల్లాల రామలింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

'గ్రామీణ విత్తనోత్పత్తి'పై అవగాహన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకంపై బుధవారం రైతులకు అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎఒ నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఎంఎస్ డాక్టర్ కె.మహేశ్వరి మాట్లాడుతూ శనగలు వేరుకుళ్లు తెగుళ్లు గమనిస్తే, నివారణకు సలహాలిచ్చారు. డిడిఎ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు తమ పొలాల్లో మట్టిని పరీక్ష చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ నాగభూషణ్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పిజిటిలను క్రమబద్ధీకరణ చేయాలి

వేంపల్లె : హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్న పిజిటిలకు జూనియర్ లెక్చరర్లుగా నామకరణం చేసి క్రమబద్ధీకరణ చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని హైస్కూల్ ప్లస్ పిజిటిలు కోరారు. బుధవారం యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబుకు వారు వినతిపత్రం అందజేశారు. హైస్కూల్ ప్లస్‌కు ప్రిన్సిపల్ లేకపోవడంతో పాఠశాల హెచ్ఎంలకు అదనపు విధులు కింద జూనియర్ కళాశాల నిర్వహణ భారం పెట్టారన్నారు. హైస్కూల్ ప్లస్ పేరును జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలగా మార్పు చేసేందుకు ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. బాలిక లకు హైస్కూల్ ప్లస్ గొప్ప వరమని, అలాంటి హైస్కూల్ ప్లస్‌ను రద్దు చేయకుండా పోరాటం చేయాలని కోరారు. హైస్కూల్ ప్లస్‌ను రద్దు చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద, బడుగు బలహీన వర్గాల బాలికలు డ్రాప్ అవుట్‌గా మారి విద్యకు దూరం అవుతారని చెప్పారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎపి పిజిటి అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నారని బుధవారం స్థానికంగా ఆయన తన స్వగృహంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్సీకి విన్నవించుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కూటమి ప్రభుత్వం చెప్పిన ప్రతి హామీని నెరవేరుస్తుందన్నారు.

పులివెందుల టౌన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు భరోసా అని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం తన నివాసంలో పులివెందుల నియోజకవర్గంలో పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. పులివెందుల పట్టణం, గుంత బజార్‌కు చెందిన సయ్యద్ షఫీకి రూ.20,000, పెద్ద కొండప్ప కాలనీకు చెందిన సలేముల హుస్సేన్ బికు రూ.59,683, పాములూరు గ్రామానికి చెందిన నాగూరు రామకృష్ణారెడ్డికి రూ.45,000, బూచుపల్లి గ్రామానికి చెందిన నంద్యాల రవీంద్రనాథ్‌రెడ్డికి రూ.59,200 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులు రైతులను గౌరవించాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : అధికారులు రైతులను గౌరవించాలని ఎమ్మెల్యే ఎన్.వరద రాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు మంచి చేసిన ప్రభుత్వాలే ఎక్కువ కాలం మనగలుగుతాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు నడుం బిగించిందన్నారు. రైతులను అధికారులు గౌరవించాలని, రైతు లేనిదే ప్రజలకు తిండి లేదని గుర్తు చేశారు. మద్యం దుకాణదారులు గడచిన కొద్ది రోజుల క్రితం తన వద్దకు వచ్చారని, అయితే అధికారులకు తాను ఒక మాట చెప్పదలుచుకున్నానని, నిబంధనలు మద్యం పాలసీలో ఏ విధంగా పొందుపరిచారు అవి తూచా తప్పక పాటించాలన్నారు. తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు మద్యం దుకాణం తెరిచి ఉంచుతాం అంటే కుదరదని అన్నారు. అధికారులు ఈ విషయంలో చట్టబద్ధంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు ముక్తియార్, జనసేన నాయకులు జిలాన్ బాషా పాల్గొన్నారు.